క్లుప్తంగా

తెప్పలకు సత్కారం



సత్కారం పొందుతున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: కాకినాడ పీఆర్ కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో కళావేదిక 149వ కవిసమ్మేళనం ఆదివారం జరిగింది. పలాసకు చెందిన కవి, రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణ మూర్తి 'పద్యము చిరంజీవే'కవితను వినిపించి ఆహూతుల అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని కళావేదిక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, కార్యదర్శి పార్థ శారధి, అధ్యక్షులు ఈశ్వరిభూషణం, చిట్టి లలిత సత్కరించారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న జగన్నాయకులు

సంతబొమ్మాళి: దుండుగుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమిలాడ గ్రామానికి చెందిన అల్లపాటి లక్ష్మణరావు కుటుంబానికి పలువురు అండగా నిలిచారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు రూ. 5 వేలు, ఉమిలాడ గ్రామస్తులు రూ. 25 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని బాధితుడుకి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మేరుగు అప్పారావు, పలువురు యువకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుడికి సత్కారం



డిల్లేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కాశీబుగ్గ: యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డిల్లేశ్వరరావు సేవలు ఉపాధ్యాయ రంగంలో మరువలేనివని వక్తలు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా డిల్లేశ్వరరావు దంపతులను యూనియన్ నాయకులు ఆదివారం కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఉపాధ్యాయుడుగా, యూనియన్ నాయకుడుగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.రమేష్, సీహెచ్ శ్రీనివాసరావు, లండ బాబూరావు, ఎల్.వి.చలం, బొడ్డేపల్లి మోహనరావు, కె.దాలయ్య, బల్ల చిట్టిబాబు, టి.జయరాం, రమణ, ఎర్రన్న, రమేష్, మోహన్ ఉన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు

మందస: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. హరిపురంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సాధన కమిటీ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య మాట్లాడుతూ.. వంశధార జలాల సాధన కోసం అందరితో కలిసి పని చేస్తామన్నారు. వంశధార చానల్‌ను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలన్నారు. రైతు సంఘ అధ్యక్షులు మార్పు ధర్మారావు, ఉపాధ్యక్షులు వెంకట్రావు, సభ్యులు నల్ల హడ్డి మాస్టర్, హేమరాజు చౌదరి, మాధవరావు, దుంపల వైకుంఠరావు, ఉగ్రపిల్లి సోమనాథం, గున్న మురళి, కొర్నాన గంగాధర్ మాస్టర్, మోహన్ దేవాడ నారాయణ, దశరథి, పాపారావు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న తారు రోడ్డు



చెరువును తలపిస్తున్న రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం, బొడ్డబడ, కీర్తిపురం, పాయితారి గ్రామాలను కలిపే ప్రధానమైన ఆర్అండ్‌బీ తారు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం, ఉన్నత పాఠశాలలకు వెళ్లే రహదారి వద్ద తారు రోడ్డు గుంతలు పండటంతో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

సమస్యలతో సావాసం!

- కనీస సౌకర్యాలకు నోచుకోని వీధులు
- రోడ్లు, కాలువలు, వీధిదీపాల్లేక అవస్థలు
- వేదిస్తున్న మంచినీటి సమస్య



కనీస సౌకర్యాలకు నోచుకోని అడ్డువాసవీధి



మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న రత్తకన్న మహిళలు (ఫైల్)

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని 18, 19, 20 వార్డులను విస్తరించి ఉన్న రత్తకన్న గ్రామం మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. దీంతో ఇక్కడ ప్రజలు సమస్యలతో ఏళ్ల తరబడి సావాసం చేస్తున్నారు. పారిశుధ్యం సైతం సక్రమంగా లేక అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్లు, కాలువలు, వీధిదీపాలు, మంచినీటి సదుపాయానికి ఇక్కడి ప్రజలు నోచుకోలేదు. దశాబ్దాల కాలంగా ఈ సమస్యలతో ప్రజలు నానాయాతన పడుతున్నప్పటికీ పురపాలకసంఘం అధికారులు మాత్రం తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. 20 వార్డు రత్తకన్న గ్రామం దేవాంగ వీధితో పాటు ఆ వీధికి ఆనుకొని ఉన్న అడ్డువాస వీధిలో వందకు పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ వీధిలో నివాసముంటున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలైన సీసీరోడ్లు, కాలువలు, వీధిదీపాలు, మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయవలసిన బాధ్యత పురపాలకసంఘం పై ఉంది. ఇక్కడి వారంతా మున్సిపాలిటీకి వివిధ పన్నులు చెల్లిస్తున్నప్పటికీ సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టిసారించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిదీపాల్లేక చీకటి పడితే కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉంటుందని, బయటికి వెళ్లాలంటే భయంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. వీధి రోడ్లు వేయాలని అధికారులను, నాయకులను స్థానికులు వేడుకగా.. దేవాంగ వీధిలో కొంత వరకు సీసీ రోడ్డుని నిర్మాణం చేసి మిగతా వదిలేశారు. అడ్డువాసు వీధికి చెందిన వారంతా రత్తకన్న మెయిన్ రోడ్డుకు రావాలంటే వీధిలో సరైన రహదారి లేక దేవాంగ వీధి నుంచి అరకిలో మీటర్ దూరం రావలసి వస్తుంది. ఇళ్లలో వినియోగించే నీరు వెళ్లేందుకు కాలువల్లేక ఇళ్ల మధ్యలోని ఖాళీస్థలాల్లో మురుగునీరు నిలిచిపోతుంది. దీంతో దోమల సమస్యలతో పాటు మురుగునీటి కారణంగా వచ్చే దుర్గంధంతో స్థానికులు పడరానిపాట్లు పడుతున్నారు. వర్షాకాలం ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. అలాగే మంచినీటి సదుపాయం లేకపోవడంతో పక్క వీధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ కుళాయి వద్ద నుంచి నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టిసారించి మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..,



మా వీధిలో నెలకున్న సమస్యలు పరిష్కరించాలని అధికారులకు చాలాసార్లు విన్నవించుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్యలతో సావాసం చేయడం అలవాటైపోయింది. అధికారులు, పాలకులు మాపై దయచూపించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

–యూ.లలిత,
రత్తకన్న దేవాంగ–అడ్డువాస వీధి

పన్నులు చెల్లిస్తున్నా పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో ఉంటున్న వారంతా మున్సిపాలిటీకి పన్నులను చెల్లిస్తున్నాం. అయితే ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదు. రోడ్లు, కాలువలు లేవు. కనీసం మంచినీటి కుళాయిలనైన ఏర్పాటు చేయాలి. ప్రధాన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలి.

–రేఖబిసాయి,
రత్తకన్న దేవాంగ–అడ్డువాస వీధి

సమస్యలు వాస్తవమే..



రత్తకన్న గ్రామంలోని దేవాంగ, అడ్డువాసువీధిలో సమస్యలున్నమాట వాస్తవమే. ఈ విషయం మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ సూచనల మేరకు అడ్డువాస వీధిలో సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

–ఎస్.రమేష్,
మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

'యువత పోరు'కు తరలిరండి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ



పిరియా విజయ

కంచిలి: శ్రీకాకుళంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సోమవారం ఉదయం పది గంటలకు వైఎస్సార్‌సీపీ చేపట్టబోయే యువత పోరు నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ శ్రేణులు సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు సోంపేట మండలం కొర్లాం హైవే జంక్షన్ వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి బయలుదేరి శ్రీకాకుళం కలెక్టరేట్‌కు పది గంటలకు చేరుకొని అక్కడ యువత పోరు ధర్నాలో పాల్గొనాల్సిందిగా కోరారు.

'యువత పోరు'ను విజయవంతం చేయండి



బమ్మిడి దుర్యోధనరావు

కాశీబుగ్గ: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో చేపట్టనున్న 'యువత పోరు'కార్యక్రమాన్ని వియవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు కోరారు. పలాసలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అధికసంఖ్యలో యువత తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పల్లా మృతి తీరనిలోటు



సింహాచలం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఉత్తరాంధ్ర యాదవ పెద్దలు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి యాదవులకు తీరనిలోటని బీసీ సంఘట రాష్ట్ర నాయకులు లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం సింహాచలం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ దాసరి తాతారావు, కాష్యూ అసోసియేషన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, యాదవ సామాజిక పెద్దలు సప్ప నవీన్, బద్రి గోపాల్, కొరికాన శంకరరావు, ఎస్.చిట్టిబాబు, కొల్లి రమేష్, కిక్కర బాలరాజు, డొక్కరి మాధవరావు, సప్ప యోగి పాల్గొన్నారు.

25న గురుకుల పాఠశాల ప్రవేశపరీక్ష

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల, దుప్పలవలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతులకు సంబంధించి మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యులు బి.చిట్టిరాజు, ఎస్.పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రంలోగా పేర్లు ఆయా పాఠశాలల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. 25న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 6, 7 తరగతుల్లో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎచ్చెర్ల పాఠశాలలో 6వ తరగతిలో 8 సీట్లు, ఏడో తరగతిలో 6 సీట్లు, తొమ్మిదిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దుప్పలవలస పాఠశాలలో 6వ తరగతిలో 21 సీట్లు, ఏడో తరగతిలో 7 సీట్లు, ఎనిమిదిలో 5 సీట్లు, తొమ్మిదిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాయకుల పరామర్శ



సోంపేట: అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న విజయ, సాయిరాజ్



కంచిలి: లోక్‌నాథ్ గొమాంగో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, పార్టీ నేతలు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన వ్యాపారి పోలాకి అప్పారావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు ఆదివారం అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కంచిలి: బూరగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొట్ట చిన్నారావు తల్లి యశోదమ్మ, అదే గ్రామానికి చెందిన కొరికాన ఎర్రయ్య ఇటీవల మృతి చెందారు. ఈ రెండు కుటుంబాల సభ్యులను జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు పరామర్శించారు. వారితోపాటు స్థానిక పార్టీ నేతలు మడ్డు వెంకటరావు, మడ్డు వెంకటేశ్వరరావు, మద్దిలి భీమారావు, పిల్లల లింగరాజు ఉన్నారు.

కంచిలి: నువాగడ గిరిజన పంచాయతీ నువాగడ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లోకనాథ్ గొమాంగో ఇటీవల మృతిచెందారు. మృతుని కుటుంబాన్ని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, వైస్ ఎంపీపీ భాగ్యవతి పండా, స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో, పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, తలగాన తిరుపతిరావు, ఋషి భయ్యా, భయ్యా గొమాంగో, సురేందర్ గొమాంగో ఉన్నారు.

భయపెడుతున్న వంతెనలు!

- ఆందోళనలో ప్రజలు



కణితూరు వద్ద వంతెనను పరిశీలిస్తున్న అప్పటి జిల్లా కలెక్టర్ మన్‌జీర్ జిలాని, వంశధార అధికారులు (ఫైల్)

నందిగాం:

మండలంలో వంశధార కాలువలపై పలు చోట్ల ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నందిగాం మండలంలో వంశధార ఎడమ ప్రధాన కాలువ సుమారు 22 కిలో మీటర్లు ప్రవహిస్తుంది. ఈ కాలువపై పలు చోట్ల 1988–89వ సంవత్సరంలో వంతెనలు నిర్మించారు. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వంతెనలపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. 2018లో నందిగాం నుంచి పూండీ వెళ్లే మార్గంలో నారాయణపురం వద్ద ఉన్న వంతెన ఇసుక లారీతో కూలిపోగా, 2022లో గొల్లూరు వద్ద ఉన్న వంతెన కూడా కూలిపోయింది. ప్రస్తుతం నందిగాం–పూండీ రహదారిలో కణితూరు వద్ద ఉన్న వంతెన, హరిదాసుపురం పాత్రునివలస మార్గంలో ఆనందపురం వంతెన, కొత్తగ్రహారం–జడ్యాడ మార్గాన ఉన్న వంతెనలు పూర్తిగా శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిపై అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నందిగాం–పూండీ రహదారి గుండా నిత్యం వందలాది మంది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఆనందపురం వద్ద ఉన్న వంతెన మీదుగా సుమారు 13 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు చేస్తారు. అలాగే కొత్తగ్రహారం వద్ద ఉన్న వంతెన మీదుగా పలాస, మెళియాపుట్టి, వజ్రపుకొత్తూరు మండలాలకు నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. ఈ వంతెనలన్నీ ప్రస్తుతం శిథిలమై భయంకరంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని వంతెనల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హరిదాసుపురం–ఆనందపురం మధ్యలో శిథిలావస్థకు చేరుకున్న వంతెన



శిథిలావస్థలో ఉన్న కొత్తగ్రహారం–జడ్యాడ వంతెన

డ్రైనేజీల పరిశీలన



కంచిలి మండలం బూరగాంలో దారుణంగా తయారైన డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ హామీ ఇచ్చారు. బూరగాం గ్రామానికి ఆదివారం వచ్చిన ఆమెకు డ్రైనేజీ సమస్యను స్థానికులు వివరించారు. దీంతో ఆమె పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతానన్నారు. పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మడ్డు వెంకటరావు, వెంకటేశ్వరరావు, బొట్ట చిన్నారావు ఉన్నారు. –కంచిలి

పొంచిఉన్న ప్రమాదం



టెక్కలి–తెంబూరు రోడ్డులో ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలో రోడ్డుకు ఒక వైపు ఉన్న వాటర్ వాల్వ్ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రమాదానికి నిలయంగా ఉన్న గొయ్యిను సరి చేయకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగితే తప్పా స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

–టెక్కలి

వస్త్ర వ్యాపారి ఔదార్యం



కంచిలి మండలం మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం నిర్వహణకు పలాసకు చెందిన వస్త్రవ్యాపారి, ఎ.ఎస్.ఆర్. ప్లాజా యజమాని అంధవరపు నాగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు 21,116 రూపాయలను విరాళంగా అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. దాత నాగేశ్వరరావు ఆశ్రమానికి ఆదివారం విచ్చేశారు. ఇక్కడ ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులకు వస్త్రదానం చేశారు. –కంచిలి

విద్యుత్ తీగలను సరిచేశారు



నిన్న ఇలా..

సాక్షి ఎఫెక్ట్...



నేడు: విద్యుత్ తీగలను సరి చేసిన తరువాత..

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామంలోని పొలాలకు వెళ్లే మార్గంలో 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతూ రైతులను భయాందోళనకు గురిచేసేవి. 15 రోజులుగా ఈ సమస్య ఉండడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు భయపడేవారు. ఈ సమస్యపై 'భయపెడుతున్న విద్యుత్ తీగలు'శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు విద్యుత్ తీగలను సరి చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా తులసమ్మ సంబరం



తులసమ్మ సంబరంలో కాళీమాత నృత్యం

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సన్నాయి మేళం, కాళీమాత వేషధారణ, కోయనృత్యాలతో భక్తులు అమ్మవారి సంబరాలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన



బడబంద జంక్షన్ వద్ద శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నందిగాం: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. మండల కేంద్రమైన నందిగాంలో రెండు రోడ్లు, ఒక సీసీ రోడ్డు, పెంటూరులో సీసీ రోడ్డు, కొటియా కొండపేట బీటీ రహదారులను ప్రారంభించారు. పెంటూరు–దబ్బలపాడు రహదారి, బడబంద జంక్షన్ నుంచి రౌతుపురం రహదారి, నందిగాం–సుబ్బమ్మపేట రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ సూర్యప్రకాష్, డీఈ సుధాకరరావు, ఐటీడీఏ ఈఈ రమాదేవి, మండలస్థాయి అధికారులు, నాయకులు పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలక్రిష్ణారావు, కొన్ని ప్రసాదరావు ఉన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

రాష్ట్రంలో అఖిలగాండ్ల తెలుకుల కులస్తులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల గాండ్ల తెలుకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అఖిల గాండ్ల తెలుకుల సంఘం సామాజిక భవనంలో జిల్లా సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు కొమనాపల్లి లక్ష్మణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన గాండ్ల తెలుకుల విద్యార్థులకు గ్రోసుల గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్, నగదు ప్రదానం చేశారు. అనంతరం గాండ్ల తెలుకుల జిల్లా యువజన సంఘం , మహిళా సంఘం కార్యవర్గాల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గాండ్ల తెలుకుల సామాజిక వర్గాన్ని ఒకే తాటిపై తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 14న శ్రీకాకుళంలోనే గాండ్ల తెలుకుల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో గాండ్ల తెలుకుల వారికి అన్ని రకాలుగా ఆదుకుంటామని చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ అనేక హామీలు ఇచ్చారన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం గాండ్ల తెలుకుల సామాజికవర్గం నువ్వులు, వేరుశనగతో పాటు మరికొన్ని విత్తనాలనుంచి తైలం తీసే వృత్తి చేపట్టి.. గౌరవంగా జీవించే పరిస్థితి ఉండేదని, కర్రగానుగుల స్థానంలో యంత్రాలు రావడంతో ఉపాధి కోల్పోయారన్నారు. అప్పటినుంచి వెనుకబాటుతనంతోపాటు విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో వెనకబాటుకు గురయ్యారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రు మధుసూదనరావు, ప్రతినిధులు దాసరి జ్ఞానమూర్తి, ఇంజరాపు విశ్వనాథం, కెల్లా శ్రీనివాస్, జోన్ వన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రవిచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెల్లా ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ కల్లేపల్లి జగన్, జిల్లా మహిళా కన్వీనర్ కె.విజయ, యువజన సంఘం నూతన అధ్యక్షుడు తెలుకుల మన్మధ, జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ సాహు, తలగాపు కామేశ్వరరావు, రాష్ట్ర సంఘం మాజీ డైరెక్టర్ ఎండపల్లి ఈశ్వరరావు, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, పి.గోపి, గండేపల్లి శ్రీనివాస్, కల్లేపల్లి శ్రీనివాస్, తెలుకుల సురేష్, వెంకటరామరాజు, బాలు, కెల్లా త్రినాథ్, అంబటి శ్రీనివాస్, జామన సాయిరాజ్, తలగాపు వెంకటరమణ పాల్గొన్నారు.